## క్లుప్తంగా

### ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత


విరాళం అందజేస్తున్న సుధాకర్‌రెడ్డి

**షాబాద్:** ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని పొన్న సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం లింగారెడ్డిగూడ మల్లన్న స్వామి దేవాలయ నిర్మాణానికి రూ.11లక్షలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం అలవర్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికి దైవభక్తి, దేశభక్తి, పితృభక్తి, సంఘభక్తి ఉండాలని సూచించారు. అనంతరం పొన్న సుధాకర్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

### వేలంలో లడ్డూ కైవసం


లడ్డూ దక్కించుకున్న గౌండ్ర సత్యం

**శంకర్‌పల్లి:** మోకిల గ్రామంలోని బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమర్జనం మంగళవారం ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లడ్డూ వేలం వేయగా కాంగ్రెస్ అధ్యక్షుడు గౌండ్ర సత్యం లడ్డును రూ.1,05,000లకు దక్కించుకున్నారు. రెండోవ లడ్డూ రూ.30,500లకు మాసగోని కృష్ణ కైవసం చేసుకున్నారు.

### రక్తదానంతో ప్రాణదానం

రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్‌మిశ్ర

**మొయినాబాద్:** యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్‌మిశ్ర అన్నారు. చిలుకూరు రెవెన్యూలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ బృందం మంగళవారం రక్తదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు సరైన సమయంలో రక్తం దొరక్క ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జనరల్ సెక్రటరీ మదన్‌మోహన్ రావు, జిల్లా చైర్మన్ నర్సింహ్మారెడ్డి, జిల్లా వైస్ చైర్మన్, మాజీ ఎంపీపీ వి.పాండుగౌడ్, కేజీరెడ్డి కళాశాల చైర్మన్ కె.కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ విజయలత, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రత్నాచారి, పీఆర్‌ఓ ప్రశాంత్, పాల్గొన్నారు.

### స్వచ్ఛతపై అవగాహన


పెద్దఎల్కిచర్లలో స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న భూపాలచారి

**కొందుర్గు:** జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్ల గ్రామంలో సర్పంచ్ భూపాలచారి ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతపై అవగాహన నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం భూపాలచారి మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి అక్టోబర్ 2 వరకు గ్రామాల్లో 'స్వచ్ఛత హీ సేవ' నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో చెత్తాచెదా రం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని కోరా రు.

### అంబేడ్కర్ విగ్రహానికి వినతి


కేశంపేట: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

**కేశంపేట:** అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తమ డిమాండ్లను పరిష్కారించాలని కోరుతూ మండల కేంద్రంలో అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. మంగళవారం అంగన్‌వాడీ సిబ్బంది అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జయమ్మ, శశికళ, సుమల్య, ప్రేమలత, వినోద, వినోదిని, తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయం

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

**కడ్తాల్:** సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో, గ్యారెంటీలతో ప్రజలను మభ్యపెట్టాలని కాంగ్రెస్ నాయకులు చూస్తున్నారని, ప్రజలు హామీలను నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. సీఎం కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయం తథ్యమన్నారు. డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, కృష్ణయ్య, నర్సింహగౌడ్, ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్ పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యం అస్తవ్యస్తం!

**రోగాల బారిన జనం**
- విజృంభిస్తున్న దోమలు
- పట్టించుకోని అధికారులు



న్యూ భాగ్యనగర్ కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగు

**షాద్‌నగర్:** పారిశుద్ధ్య లోపం ప్రజలకు శాపంగా మారింది. ఎక్కడ పడితే అక్కడ చెత్త, చెదారం పడేస్తున్నారు. రోడ్లపై మురుగు నీరు ప్రవహించడంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో జనం వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. షాద్‌నగర్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది.

**నత్తనడకన డంపింగ్ యార్డు పనులు..**
షాద్‌నగర్ మున్సిపాలిటీ రోజుకు రోజుకు విస్తరిస్తూనే ఉంది. సేకరించిన చెత్తను ఒక చోట వేసేందుకు పట్టణ శివారులోని సీఎస్‌కే వెంచర్ వెనక భాగంలోని ప్రభుత్వ భూమిలో డంపింగ్ యార్డును నిర్మిస్తున్నారు. సుమారు మున్సిపల్ నిధుల నుంచి రూ. 12లక్షలతో చేపడుతున్న ఈ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. దీంతో పారిశుద్ధ్యం పడకేసింది. పట్టణంలో సేకరించిన చెత్తను ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలోని సోలిపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో పారబోస్తున్నారు.

**రోజుకు 35మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ..**
షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 28వార్డులు ఉన్నాయి. సుమారుగా 20వేల ఇళ్లు ఉన్నాయి. పట్టణంలో జనాభా సుమారుగా లక్షకుపైగా నివాసం ఉంటున్నారు. ప్రతీ రోజు మున్సిపల్ సిబ్బంది సుమారు 35 మెట్రిక్ టన్నుల తడి, పొడి చెత్తను సేకరిస్తున్నారు. ఇందులో సుమారు 400 కిలోల వరకు కూరగాయల వ్యర్థాలను సేకరిస్తున్నారు. చెత్త సేకరణ కోసం 28 వార్డులో ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరిస్తున్నారు. ఈ పనులు చేయడానికి సుమారు 115మంది పారిశుద్ధ్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

**రోడ్లపై పారుతున్న మురుగు**
పట్టణంలోని శివారు కాలనీల్లో ఇళ్లనుంచి వచ్చే మురుగు నీరు రోడ్లపైనే పారుతుంది. దీంతో కాలనీల్లో దోమలు, ఈగలు విపరీతంగా వ్యాపిస్తున్నాయి. తద్వార ప్రజలు రోగాల బారిన పడి ఆసుపత్రుల చుట్టు తిరుగుతున్నారు. దోమలను నిర్మూలించేందుకు తరుచూ ఫాగింగ్ చేయాల్సి ఉండగా మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారే ఆరోపణలు వస్తున్నాయి.

**మురుగు చేరకుండా చర్యలు చేపట్టాలి**



ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు రోడ్లపై పారుతుండడంతో దుర్వాసన వెదజల్లుతుంది. దోమలు వ్యాపిస్తున్నాయి. పందులు విపరీతంగా సంచరించడంతో రోగాల బారిన జనం పడుతున్నారు. వెంటనే అధికారులు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి
– ఆవుల శ్రీశైలం, న్యూభాగ్యనగర్ కాలనీ, షాద్‌నగర్

**ఫాగింగ్ చేయాలి**



కొన్ని రోజులుగా దోమలు విజృంభిస్తున్నాయి. దోమల నివారణకు మున్సిపల్ సిబ్బంది తరుచుగా కాలనీల్లో ఫాగింగ్ చేయాలి. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి
– వెంకటేశ్, రాంనగర్ కాలనీ, షాద్‌నగర్

# అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శం

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

**శంకర్‌పల్లి:** సీఎం కేసీఆర్ ప్రవేశ పెడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం జనవాడ, మిర్జాగూడ, ఇంద్రారెడ్డి నగర్, మహారాజ్‌పేట్, గోపులారం గ్రామాల్లో అండర్‌డ్రైనేజీ, సీసీ రోడ్లకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రతీ గ్రామానికి మౌలిక వసతులు కల్పించడంతో పాటు సీసీ రోడ్లు, అండర్‌డ్రైనేజీ ఏర్పాటునకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారన్నారు. రైతు సంక్షేమం కోసం రైతు బంధు, రైతు బీమా పథకాలను ప్రవేశ పెట్టారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు, వైస్ చైర్మన్ కురుమ వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రవిందర్‌గౌడ్, సర్పంచ్‌లు గొడిచర్ల లలిత, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, ఎంపీటీసీలు నాగేందర్, తొండ మల్లమ్మ, గుడిమాల్కాపురం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు సామయ్య, తదితరులు పాల్గొన్నారు.


పనులకు శంకుస్థాపన చేస్తున్న తీగల అనితారెడ్డి, ఎమ్మెలే కాలె యాదయ్య

# సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

**షాబాద్:** సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. ఆపదలో ఉన్న ప్రతీ కుటుంబాన్ని ఆదుకుంటామని మంగళవారం మద్దూరు గ్రామానికి చెందిన శివప్పకు రూ.1లక్ష మంజూరైన చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి ఆదుకోవడం తమ బాధ్యత అని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు, ఫుడ్ సెక్యూరిటీ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకానికి అర్హులన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఎంతో మంది నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మయ్య, రాందేవ్‌యాదవ్ పాల్గొన్నారు.


చెక్కు పంపిణీ చేస్తున్న పట్నం అవినాశ్‌రెడ్డి

# గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు


చేగూరులో గ్రంథాయాలన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

- ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- చేగూరులో గ్రంథాలయం ప్రారంభం

**నందిగామ:** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. చేగూరులో అమెజాన్ వెబ్ సర్వీసెస్(ఏడబ్ల్యూఎస్) ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని మంగళవారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసేందుకు సర్పంచ్ మామిళ్ల సంతోష విఠల్ చేసిన కృషి ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. ఇక్కడ గ్రంథాలయం లేదని తెలుసుకున్న అమెజాన్ వెబ్ సర్వీసెస్ వారు స్వచ్ఛందగా ముందుకు వచ్చి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా ఎంతో జ్ఞానం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్, సర్పంచ్ సంతోష, ఎంపీపీ ప్రియాంక, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్, అమెజాన్ డేటా సెంటర్ ప్రతినిధులు మల్లేశ్, పార్థసారథి, అవినాష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధికి ఆకర్షితులై చేరికలు**
**కొత్తూరు:** బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై ఆయా పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. కొడిచర్ల గ్రామానికి చెందిన ఆయా పార్టీల నాయకులు మంగళవారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్‌లో అధిక సంఖ్యలో వలసలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మెండెకృష్ణ, నర్సింహ్మారెడ్డి, రవీందర్‌రెడ్డి, జగదీశ్, శ్రీనాథ్, జంగయ్య పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం

**సాక్షి, సిటీబ్యూరో:** ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని సర్పంచ్ ఎం మోహన్‌రెడ్డి అన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించే వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పీఎంఆర్ ఆసుపత్రి సహకారంతో చేవెళ్ల మండలంలోని మల్లారెడ్డిగూడ గ్రామంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తరహా వైద్య సేవలు గ్రామీణులకు అవసరమని అంటూ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో భాగంగా ఆర్థోపెడిక్స్, ఆప్తాల్మాలజీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, సైకియాట్రీ జనరల్ మెడిసిన్‌తో సహా ఏడు వేర్వేరు విభాగాలకు చెందిన సుశిక్షితులైన వైద్య నిపుణుల బృందం ఆధ్వర్యంలో గ్రామీణులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వెల్‌స్పన్ గ్రూప్ డైరెక్టర్ ఏకె జోషి తదితరులు పాల్గొన్నారు.

### రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే

ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రూప్లానాయక్

**కేశంపేట:** రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రూప్లానాయక్ అన్నారు. ఇంటింటికి కాంగ్రెస్‌లో భాగంగా బైర్కాన్‌పల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రూప్లా నాయక్ మాట్లాడుతూ రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను అందజేయనున్నట్లు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అనేక సంక్షేమ పథకాలు అమలు చేయనున్నట్లు చెప్పారు. ఉప సర్పంచ్ మాణేమ్మ, బైకని వెంకటయ్య, పాల్గొన్నారు.

### ఏఈఈలో శంకర్‌పల్లి యువకుడికి 4వ ర్యాంక్

**శంకర్‌పల్లి:** ఏఈఈ పరీక్షల్లో శంకర్‌పల్లికి చెందిన యువకుడు సత్తా చాటాడు. టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్–2023 ఫలితాల్లో సాయినగర్ కాలనీకి చెందిన పులకంటి విష్ణుతేజ స్టేట్ 4వ ర్యాంకును సాధించాడు. ఆయన ఇప్పటికే రైల్వేలో పనిచేస్తున్నాడు.

# ఒవైసీ వ్యాఖ్యలు సరికావు


మాట్లాడుతున్న వెంకటస్వామి

డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి

**చేవెళ్ల:** రాహుల్‌గాంధీ దేశంలో ఎక్కడి నుంచైనా పోటీ చేసి గెలిచే దమ్ము ధైర్యం ఉందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం మండల అధ్యక్షుడు అలంపల్లి వీరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీపై ఒవైసీ చేసిన వాఖ్యలు సరికావని ఖండిస్తూ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పడాల వెంకటస్వామి, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ నాయకుడు పెంటయ్యగౌడ్‌లు మాట్లాడారు. రాహుల్‌గాంధీని విమర్శించే స్థాయి ఓవైసిది కాదని ఘాటుగా స్పందించారు. ఒవైసీకి దమ్ముంటే చేవెళ్లలో పోటీ చేసి గెలువాలని కాంగ్రెస్ నాయకులు ప్రతీ సవాల్ చేశారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ బాలయ్య, యూత్ నాయకులు శ్రీనివాస్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# పండుగలు మత సామరస్యానికి ప్రతీక

సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి

**కేశంపేట:** పండుగలు మత సామరస్యానికి ప్రతీకలని సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర కాలనీలో యూత్ సభ్యులు ఏర్పాటుచేసిన గణపతి మంటపం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ వెంకట్‌రెడ్డి ముగ్గులను పరిశీలించారు. మొదటి బహుమతి మంచె అలివేలు రూ.2,016లు, రెండోవ భోగ చందన రూ.1,516లు, మూడోవ రోయ్యల దివ్య రూ.1,000లు, నాలుగోవ బహుమతి వీరమోని కళ్యాణి రూ.5,00లు సర్పంచ్, నిర్వాహకులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచె కృష్ణయ్య, మంచె శ్రీశైలం, నర్సింలు పాల్గొన్నారు.


బహుమతులు ప్రదానం చేస్తున్న వెంకట్‌రెడ్డి

# ముదిరాజ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**మొయినాబాద్:** ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడిగా మేడిపల్లి గ్రామానికి చెందిన పి యాదయ్య ఎన్నికయ్యారు. చిలుకూరు మల్లికార్జున స్వామి దేవాలయం వద్ద ముదిరాజ్ సంఘం సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా యాదయ్యతోపాటు ఉపాధ్యక్షుడిగా రాంచందర్, భిక్షపతి, మల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, సహాయ కార్యదర్శులుగా రమేశ్, మహేందర్, వైరమేశ్, కోశాధికారిగా నర్సింలు, కార్యవర్గ సభ్యులుగా గోపాల్, పాండు, శ్రీనివాస్, మల్లేశ్, టి శ్రీనివాస్, సుధాకర్, వెంకటేశ్, శివకుమార్, రామకృష్ణ, కె.శ్రీనివాస్, బిక్షపతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ముదిరాజ్ సంఘం నాయకులు శ్రీరాములు, ఆర్ యాదయ్య, శ్రీనివాస్, అంజయ్య, రమేశ్, నీలకంఠం, బాల్‌రాజ్, ప్రకాశ్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.


యాదయ్యను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

# సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



షాద్‌నగర్: సమ్మెలో పాల్గొన్న ప్రవీణ్ యాదవ్

పీసీసీ నేత ఆలుగడ్డ ప్రవీణ్ యాదవ్

**షాద్‌నగర్:** ఆశా వర్కర్లు, అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని పీసీసీ మాజీ కార్యదర్శి ఆలుగడ్డ ప్రవీణ్ యాదవ్ అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశావర్కర్లు చేపట్టిన నిరసన దీక్షకు మంగళవారం ఆలుగడ్డ ప్రవీణ్ యాదవ్ మద్దతు తెలిపారు.

**కేశంపేటలో..**
**కేశంపేట:** మండల కేంద్రంలో సమ్మె కొనసాగిస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని ఆశాలు డిమాండ్ చేశారు. వసంత, సుజాత, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

**కొందుర్గులో..**
**కొందుర్గు:** కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటి పథకాలు అందిస్తామని ఆలుగడ్డ ప్రవీణ్‌యాదవ్ అన్నారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో పర్యటించారు. సమ్మెకు మద్దతు తెలిపారు.


చేవెళ్ల: సమ్మెలో పాల్గొన్న అల్లి దేవేందర్

**చేవెళ్లలో..**
**చేవెళ్ల:** ఆశా కార్యకర్తల శ్రమను గుర్తించి వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి అల్లీ దేవేందర్ అన్నారు. అన్నపూర్ణ, విజయలక్ష్మి, కృష్ణవేణి, మాధవి, జయమ్మ, ధనలక్ష్మి, పావని, తదితరులు పాల్గొన్నారు.


మొయినాబాద్: చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


షాద్‌నగర్ రూరల్: ఐలమ్మ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్


నందిగామ: అప్పారెడ్డిగూడలో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వీర్లపల్లి శంకర్

# నేటి తరానికి స్ఫూర్తి

భూమికోసం, భుక్తికోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని పలువురు పేర్కొన్నారు. నియోజక వర్గంలోని పలు మండల కేంద్రాల్లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, రజక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. పలువురు నాయకులు ఆమె చేసిన పోరాటాలను గుర్తుచేసుకున్నారు. చాకలి ఐలమ్మ నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తుందని పలువురు కొనియాడారు.


మొయినాబాద్ రూరల్: చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించిన కాలె యాదయ్య


చేవెళ్ల: నివాళులర్పిస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీఆర్‌ఎస్ నాయకులు


షాబాద్: నివాళులర్పిస్తున్న వైస్ ఎంపీపీ జడల లక్ష్మి, సుబ్రమణ్యేశ్వరి, చంద్రయ్య


శంకర్‌పల్లిలో నివాళి అర్పిస్తున్న చైర్‌పర్సన్ అనితారెడ్డి, కాలె యాదయ్య